క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ఎండీ షరీఫ్

కుభీర్: మండలంలోని అంబకంటికి చెందిన జాదవ్ కై లాష్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై ఎండీ షరీఫ్ శనివారం అప్పగించారు. సిర్పెల్లి గ్రామంలో మే 9న సెల్‌ఫోన్ పొగొట్టుకోవడంతో ఆయన ఫిర్యాదు చేశారు. ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తెలుసుకుని ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఐఐటీలో సీటు



చేతన్‌ను సన్మానిస్తున్న సర్పంచ్

లక్ష్మణచాంద: ఇటీవల ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన దూస చేతన్ కాన్పూర్ ఐఐటీలో సీటు సాధించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేతన్‌ను సర్పంచ్ ముత్యంరెడ్డి సన్మానించారు. ఉపాధ్యాయులైన చేతన్ తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ-రాజామణి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేశ్వర్, వార్డు సభ్యుడు పోశెట్టి, బిల్ కలెక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి సన్మానం



హర్షిత్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన హర్షిత్ స్థానిక ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదివి ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పీఏ(ఐకేఆర్) నాళం శ్రీనివాస్, వైద్యులు శశికాంత్, స్వప్న శనివారం సన్మానించారు. గ్రామపెద్దలు మహేందర్, రవీందర్, హుస్సేన్, రాజేందర్, విశాల్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన విద్యార్థి మణిదీప్ బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశాలో సీటు సాధించాడు. గ్రామానికి చెందిన అధ్యాపకులు మణిదీప్‌ను సన్మానించారు. అధ్యాపకులు రాజేశ్వర్,పి.నరేష్ కుమార్ ,విమాలాకర్ తదితరులు ఉన్నారు.

దొరికిన వస్తువుల అప్పగింత



వస్తువులను అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి అన్నదాన సత్రంలో శనివారం విజయవాడ భక్తులు పోగొట్టుకున్న వస్తువులు తిరిగి అప్పగించారు. రూ.15 వేల విలువ చేసే సెల్‌ఫోన్, రూ.వెయ్యి నగదు పోగొట్టుకున్నారు. అక్కడే పనిచేసే జూనియర్ అసిస్టెంట్ నారాయణ పటేల్‌కు ఇవి దొరికాయి. వీటిని విజయవాడ భక్తులకు తిరిగి అప్పగించారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశం

కుంటాల: ఉపాధిహామీ పథకంలో 2018-19 సంవత్సరంలో వంద రోజుల పని పూర్తిచేసిన కుటుంబాల్లోని 18 నుంచి 45 ఏళ్ల నిరుద్యోగులకు ఉద్యోగవకాశం కల్పిస్తున్నట్లు ఏపీవో నవీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఏసీ(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్), ఈడబ్ల్యూఆర్సీ(ఇంగ్లిష్ వర్క్ రెడ్యూనేష్ అండ్ కంప్యూటర్స్)తోపాటు స్వయం ఉపాధి, శిక్షణ, వ్యవసాయ పరిజ్ఞాన పెంపుపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు స్థానికంగా, యువకులకు హైదరాబాద్‌లో మూడు నెలల శిక్షణ ఇస్తారని, ఉచిత వసతి, భోజన సౌకర్యంతోపాటు రూ. 237 చెల్లిస్తారని తెలపారు. పదో తరగతి మెమో, ఆధార్, రేషన్, ఉపాధిహామీ కార్డుతోపాటు పాస్‌ఫోటోతో ఈనెల 10లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో వార్డు మెంబర్ మృతి

ముధోల్: మండల కేంద్రంలోని యశ్వంత్‌నగర్ పంచాయతీ పరిధిలోని 1వ వార్డు మెంబర్ సోన్‌కాంబ్లే ప్రకాశ్ గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. ఉదయం అనారోగ్య సమస్య తలెత్తడంతో కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు.

వానలో.. ఉపాధి

- వివిధ డిజైన్లలో రెయిన్‌కోట్‌లు లభ్యం
- ఊపందుకున్న విక్రయాలు
- చిన్నారులకు నచ్చేలా క్యాప్‌లు
- కొనుగోలుకు పలువురి ఆసక్తి





నిర్మల్‌ఖిల్లా: వర్షాకాలం వచ్చేసింది. బయటకు వెళ్తే వానకు తడవకుండా ఉండేందుకు జనం రెయిన్ కోట్‌లు, గొడుగులను కొనుగోలు చేస్తుండడంతో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లాకేంద్రంలోని న్యూబస్టాండ్, పాత బస్టాండ్, గాంధీ పార్క్, పాత కలెక్టర్ చౌరస్తా, శివాజీచౌక్, నారాయణ రెడ్డి మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. వివిధ మోడళ్లు, డిజైన్లలో గొడుగులు, రెయిన్ కోట్లు, వాటర్ ప్రూఫ్ టోపీలు లభ్యమవడంతో కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. కలకత్తా, పంజాబ్, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి తెచ్చి వ్యాపారులు ఇక్కడ విక్రయిస్తున్నారు. పురుషులకు ఫ్యాంట్, షర్ట్, లాంగ్ కోట్, మహిళల కోసం లాంగ్ కోట్స్ అందుబాటులో ఉంటున్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చిన రెయిన్ క్యాప్‌లకు గిరాకీ ఉంటోంది.

ధరలు ఇలా..

పెద్ద షాపింగ్ మాల్స్, మార్ట్‌ల్లో కన్నా రోడ్లపై ఏర్పాటు చేసిన షాపుల్లో జనం రద్దీగా ఉంటోంది. రెయిన్ కోట్‌ల్లో బ్రాండెడ్ ధర రూ.800 నుంచి రూ.2 వేలపైగా ఉన్నాయి. చిన్న పిల్లలవి రూ.500 నుంచి రూ.1500, గొడుగులు రూ.120 నుంచి రూ.500, రెయిన్ క్యాప్‌లు రూ.100 ఉన్నాయి. చిన్నారులకు బుజ్జిబుజ్జి సైజు గొడుగులకు రూ.130, రూ.180, రూ.220, రూ.280 ధర ఉన్నాయి. స్కూల్‌కు వెళ్లే చిన్నారుల కోసం చిన్నసైజుల్లో రెయిన్‌కోట్లు, గొడుగులు విక్రయిస్తున్నారు.

గిరాకీ పెరిగింది



మహిళలు, చిన్నపిల్లలు, యువత కోసం వివిధ డిజైన్లలో గొడుగులు, రెయిన్ కోట్లు అందుబాటులో ఉంచాం. వీటిని జనం కొనుగోలు చేస్తుండడంతో గిరాకీ పెరిగింది. – కొండారి కిరణ్, వ్యాపారి, నిర్మల్

రెయిన్‌కోట్ ధరిస్తా



నేను వృత్తిరీత్యా పలు ప్రాంతాలకు బైకుపై వెళ్లాల్సి ఉంటుంది. వర్షాలకు తడవకుండా రెయిన్ కోటు ధరిస్తాను. వెచ్చదనంతో పాటు తడవకుండా ఉంటుంది. – కదారి రమణ, వినియోగదారుడు,నిర్మల్

సంక్షిప్త వార్తలు

ఆపదలో 100కు డయల్ చేయాలి

నిర్మల్‌టౌన్: ఎవరైనా ఆపదలో ఉంటే 100కి డయల్ చేయాలని షీటీం ఎస్సై సుమంజలి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో షీటీం బృందం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. 100 డయల్, సీసీ కెమెరాలతో ఉపయోగాలు, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఇందులో షీ టీం పోలీసులు పాల్గొన్నారు.

నేడు మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

కుంటాల: స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆదివారం బోనాల పండుగను నిర్వహించనున్నారు.

దాతల సహకారం మరువలేనిది

నర్సాపూర్(జి): ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో దాతల సహకారం మరువలేనిదని కుస్లీ ఉప సర్పంచ్ సాదోల్ల సంతోష్ అన్నారు. మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన నార్వాడే అనురాధ-వెంకట్‌రావు పాటిల్ దంపతుల కుమారుడు ప్రశాంత్ పాటిల్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.50 వేలు విలువ గల వాటర్ ప్యూరిఫైర్ యంత్రాన్ని అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ అలూరి రవి, బీఆర్ఎస్ నాయకుడు బి.భూమేష్, పాఠశాల హెచ్ఎం టి.రవి, ఉపాధ్యాయులు ఏ.రాజేశ్వర్, జి.భూమేష్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పెంబి: మందపల్లిలోని కేజీబీవీ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వో వీణా ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ గ్రూప్‌లో 40, బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

నిర్మల్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని పట్టణ సీఐ పురుషోత్తం అన్నారు. జిల్లా కేంద్రంలోని కూరన్నపేట్ కాలనీలో మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ చట్టాలు, బాల్యవివాహాలు, గృహహింస చట్టాలు, న్యాయ సేవల గురించి తెలుసుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హెచ్ఎంకు ప్రశంసాపత్రం అందజేత

ముధోల్: పదోతరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా హెచ్ఎం సారథి రాజును హైదరాబాద్‌లోని శారద దామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాపీఠం కార్యదర్శి సుదర్శన్, తదితరులు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

సన్మానం

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్(అటెండర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన పందిరి లక్ష్మీబాయిని శనివారం ఉద్యోగులు, రాజకీయ నాయకులు సన్మానించారు. ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ విశ్వంబర్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఎంపీటీసీలు దేవిదాస్, పోసాని పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ బోర్డ్ మెంబర్‌కు సన్మానం

ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్‌గా ఇటీవల ఎంపికైన కుభీర్‌కు చెందిన బీజేపీ నాయకుడు బి.గంగాశేఖర్‌ను మిత్ర మండలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. టి.గంగాధర్, వెంకట్ స్వామి, కె.సుదర్శన్, ఎస్.సుదర్శన్, సూది గంగాధర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే రేఖానాయక్



ఖానాపూర్: కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న ప్రజలు

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో శనివారం ఆమె పర్యటించారు. కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యేకు పలువురు విన్నవించారు. శ్రీరాంనగర్‌లోని గోదావరి వద్ద గల ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నూతన షెడ్ల నిర్మాణానికి కృషిచేయడంతోపాటు పుష్కర ఘాట్ సమీపంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతున్న శాంతినగర్ కాలనీకి చెందిన పాదం రాజన్నను పరామర్శించారు. అంకం రాజేందర్, కలీల్, పుప్పాల శంకర్, రాజగంగన్న, గంగాధర్, జనార్దన్, భీమేశ్వర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాలాభివృద్ధి

కడెం: గ్రామాలాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. 'పల్లె..పల్లెకు రేఖక్క' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాండ్వపూర్‌లో శనివారం ఆమె పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. గృహాలక్ష్మీ పథకంలో భాగంగా గ్రామానికి 50 ఇళ్లు కేటాయిస్తానని, సాగు నీటి కాలువ సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనంతరం నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీవో ఉపేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచులు మల్లవ్వ, వేణుగోపాల్, గంగన్న, నాయకులు మల్లేశ్, గంగన్న, లచ్చన్న, సత్తెన్న, రవి, నల్గొండ, హాసీబ్ ఉన్నారు.

ప్రజా ధనాన్ని దోచుకుంటున్న ఎమ్మెల్యే

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

కడెం: ఎమ్మెల్యే రేఖానాయక్ బిజినెస్‌ల పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని టీపీసీసీ రాష్ట ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడారు. ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నా తన ప్రైవేటు కళాశాలలు మూతపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రైస్ మిల్లుల్లో ధాన్యం కోత విధిస్తూ రైతులను దోచుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే భర్త శ్యాంనాయక్ షాడో ఎమ్మెల్యే అని, చెక్‌పోస్ట్ ముడుపులు వ్యవహారంలో ఉన్నాతాధికారులు చర్యలు తీసుకుంటారని, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారని అరోపించారు. ఇక బీజేపీ నేత రాథోడ్ రమేశ్ చెల్లని రూపాయన్నారు. ప్రజలు గత ఎన్నికల మాదిరిగానే ఆయనకు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ఇటీవలే నూతన మండలాధ్యక్షుడిగా నియమాకమైన తుమ్మల మల్లేశ్‌యాదవ్‌ను సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని సూచించారు. పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాలప్డే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, రఫీక్, వాజీద్‌ఖాన్, బబ్లూ, భూషణం, వెంకటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా సదర్మాట్ గైడ్‌వాల్

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి వద్ద చేపడుతున్న సదర్మాట్ గైడ్‌వాల్ పనులు నాసిరకంగా సాగుతున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వైఎస్సార్ సదర్‌మాట్ రైతుల చిరకాల కోరికను గుర్తించి బ్యారేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. పాలకుల వైఫల్యంతో బ్యారేజీ నిర్మాణం ఖానాపూర్‌లో చేపట్టకుండా నిర్మల్ నియోజవర్గానికి తరలించుకుపోయారన్నారు. పెంబి మండలం పసుపుల బ్రిడ్జి పనుల్లో నాణ్యత లోపంతో కొట్టుకుపోయిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, నాయకులు నేత శ్యాం, రాచమల్ల అశోక్, చింతపండు రవి, సలీం ఖాన్, అలిశెట్టి నాగరాజు, మైన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న గిరిజన రైతులు

పెంబి: రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని తాటిగూడ గ్రామంలో గిరిజన రైతులు శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పోడు భూములకు పట్టాలిచ్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. సర్పంచ్ తానాజీ, గ్రామ గిరిజన రైతులు ఉన్నారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ స్వీపర్స్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరహిస్తున్న రిలే నిరాహార దీక్షలను శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ప్రజలే బీఆర్ఎస్‌ను బహిష్కరిస్తారు’



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని మోదీ సభను బహిష్కరిస్తామని మంత్రి కేటీఆర్ చెప్పడం కాదు.. ప్రజలే బీఆర్ఎస్‌ను బహిష్కరిస్తారని బీజేపీ రాష్ట నాయకుడు పెద్దపెల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రూ.6,100 కోట్ల అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ప్రధాని వస్తే సీఎం స్వాగతం పలుకకుండా అవమానపరుస్తున్నారని అన్నారు. ప్రధాని సభకు ఎందుకు రావడం లేదో ప్రజలకు సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, సీనియర్ నాయకులు ఒడిసెల శ్రీనివాస్, అయ్యన్నగారి రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, రామోజీ నరేశ్, ఉపాధ్యక్షుడు ఒడ్నాల రాజు, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, నాయకుల హనుమంత్రాజు, వినోద్ పాల్గొన్నారు.

మూడోరోజూ పంచాయతీ కార్మికుల సమ్మె



దిలావర్‌పూర్‌లో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

దిలావర్‌పూర్/పెంబి/కడెం/ముధోల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి మూడో రోజూ చేరింది. సిబ్బంది, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.19,500 చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి, అర్హులందరికీ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెంబిలో కార్మికుల సమ్మెకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, ముధోల్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మద్దతు తెలిపారు. సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షులు అధ్యక్షులు భూమన్న, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు



వాహనదారులకు పలు సూచనలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, రాంగ్ రూట్‌లో వెళ్లినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 50 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో కొందరు ట్రాఫిక్ చాలాన్లు తప్పించుకునేందుకు, నంబర్ ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్‌ప్లేట్‌ను విరగొట్టినా, తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 22 మందికి రూ.500తో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న బీజేపీ నాయకుడు రామారావ్ పటేల్

తానూరు: మండలంలోని బెంబరలో పద్మినిబాయి, కళ్యాణి గ్రామంలో కిషన్ పటేల్, జౌలా(కే)లో సంగీత బాయి, లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ నాయకుడు రామారావ్ పటేల్ శనివారం పరామర్శించారు. నాయకులు శివాజీ పటేల్, చక్రధర్ పటేల్, సోమనాథ్, ఎల్లప్ప, మాధవ్‌రావ్, పోశెట్టి దత్తహరి, బాలాజీ, శంకర్, రాజు, లక్ష్మణ్, లాలు పటేల్, దిగాంబర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో గుద్దేటి లక్ష్మీనారాయణ, రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ సమీర్, శేక్ అలీమొద్దీన్‌లు మృతి చెందారు. బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకుడు కె శ్రీహరిరావు శనివారం పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వీవోఏలు, తదితరులు

ముధోల్: మండలంలోని గన్నోరా గ్రామానికి చెందిన వీవోఏ సరిత భర్త ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి వీవోఏల సంఘం సభ్యులు రూ.లక్షా 50 వేలను సమకూర్చగా, వీవోఏ సరితకు శనివారం అందజేశారు. కార్యదర్శి కేర్భా, కోశాధికారి బద్దం శ్రీలత, సీసీలు వందేమాతరం, సూర్యకాంత్, వీవోఏలు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: పట్టణంలోని నాగేశ్వర్‌వాడ కాలనీకి చెందిన అయ్యన్నగారి శేఖర్ గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి నిర్మల్ మున్నూరు కాపు యువజన సంఘం తరపున శనివారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం శేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షుడు సుధాకర్, కౌన్సిలర్లు ఎస్పీ రాజు, రామకృష్ణ, శ్రీధర్ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ ఉత్సవం



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువ ఉత్సవంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి ఉపన్యాస, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జానపద నృత్యం ప్రదర్శించిన చాణక్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5 వేలు, నిర్మల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.2,500 నగదు బహుమతి పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు మాట్లాడుతూ యువత పాత్ర దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. యువత సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొనాలని, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఇందులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీటి కాల్వలను శుభ్రం చేయిస్తాం



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణంలో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయిస్తామని మున్సిపల్ గండ్రత్ చైర్మన్ అన్నారు. పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో గల శనివారం మురుగునీటి కాల్వలను పరిశీలించారు. దగ్గరుండి సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఐకేరెడ్డి ఆదేశానుసారం పట్టణంలోని భారీ మురుగు నీటి కాల్వల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షపు నీరు మురుగునీటి కాల్వల్లో వెళ్లేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏఈ హరిభూవన్, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్,మేడారం అపర్ణ-ప్రదీప్, ముజాయిద్ చౌస్,నాయకులు, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.